ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 7 మార్చి 2022

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


భగవద్గీత - శ్లోకం 2-45 ........................................ 24

అక్షరమణమాల ........................................................ 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



మనిషికి ముందు వాడి మీద వాడికి నమ్మకం ఉండాలి. తరువాత భగవంతుడి మీద నమ్మకం ఉండాలి. "భగవంతుడి మీద నమ్మకం లేకపోతే నాస్తికుడివి కాదు, నీ మీద నీకు నమ్మకం లేకపోతే నాస్తికుడివే" అనేవారు స్వామి వివేకానంద. మనం చేసే పని మీద మనకు విశ్వాసం ఉండాలి.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 25 డిసెంబరు 1983, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ప్రకృతిని దాటి, భగవంతుడిని దాటి, లోకాన్ని దాటి, జీవ లక్షణాలు దాటి, నాలుగు వేదములలో ఏ స్థితి అయితే ఉత్కృష్ట స్థితి అనిచెప్పబడిందో, అటువంటి ఉత్కృష్టమైన స్థితికి మీరు అందరూ కూడా చేరుకుంటారు. అది స్వల్ప విషయం. దేవుడు ఉన్నాడా, లేదా అనే గొడవ వద్దు. అన్నీ నాకు తెలుసును అనే భావన ఉండకూడదు. మీకు గర్వం ఉండకూడదు. నీళ్ళు ఎప్పుడూ పల్లానికి వెళతాయి అలాగే డబ్బు అయినా, విజ్ఞానం అయినా వినయం ఉన్నవాడి దగ్గరకు వచ్చి చేరతాయి.

ఇక్కడ అత్యం సూర్యం గారు మాటలు జ్ఞాపకం వస్తున్నాయి నా పొగరుబోతుతనం వల్ల పదిలక్షల రూపాయలు పోగొట్టుకున్నాను నా జీవితంలో అని చెప్పారు. ఆయనకి మనసులో కొంచెం పొగరుబోతుతనం, మాటలు జాగ్రత్తగా మాట్లాడకపోవటం ఉండేది. అందుకే ఇలా డబ్బు పోగొట్టుకున్నాను అని చెప్పారు. రమణమహర్షిని ఆయన, ఆయన భార్య చూసినప్పుడు ఆయనకు ఏమనిపించింది అంటే ఏమిటి గోచీ పెట్టుకొని కూర్చున్నాడు ఈయన, నా భార్య ఇక్కడకు తీసుకొని వచ్చింది ఏమిటి అనుకున్నాడు. ఆయనకు ఉన్న పొగరుబోతు తనం వల్ల అలా అనిపించింది. ఇంతకి ఎందుకు చెబుతున్నాను అంటే ఈ విషయాలు మీరు ఏ రంగంలో ఉన్నా సరే, ఇంటికాడ అయినా సరే, డబ్బు సంపాదనలో అయినా సరే, చదువులో అయినా సరే, ఏ మనిషికి కూడా గర్వం ఉంటే ఏది అబ్బదు. మీ డబ్బు వల్ల మీకు గర్వం వస్తుంటే, మీ చదువు వల్ల మీకు గర్వం వస్తుంటే, మీకు డబ్బు అనవసరం, చదువు అనవసరం. అది జ్ఞాపకం ఉంచుకోండి. మీకు డబ్బు ఉండటం మంచిదే, చదువు ఉండటం మంచిదే. కానీ మీ డబ్బు మీకు గర్వం తెస్తుంటే, మీ చదువు మీకు గర్వం తెస్తుంటే, మీ డబ్బు, చదువు కలిపి మీకు ఎంత అపకారం చేస్తుందంటే, మీకు వంద జన్మలకి సరిపడా అపకారం చేస్తుంది. మిమ్మల్ని వంద జన్మలకి సరిపడా పీడించేస్తుంది, చివరకు శరీరాలు నిలబడవు, సంసారాలు నిలబడవు, డబ్బు నిలబడదు. డబ్బు వల్ల కాని

గర్వం వస్తే, చదువు వల్ల కాని గర్వం వస్తే మీకు ఏమైనా కీర్తి ఉంటే ఆ కీర్తి వల్ల కాని గర్వం వస్తే, ఆ గర్వం మీకు వంద జన్మలకి సరిపడ చెడ్డతీసుకు వస్తుంది, దానివల్ల పాపం వస్తుంది, దానివల్ల అనేక నీచ జన్మలు వస్తాయి.

అందుచేత మీరు ఏ రంగంలో అయినా డబ్బు విషయంలో కాని, చదువు విషయంలో కాని, ప్రాపంచిక విషయాలలో కాని మీరు అభివృద్ధిలోకి రావాలి అంటే ఎంత వినయంగా ఉంటే అంత మంచిది. అదే ఉపనిషత్తులలో చెప్పారండి. ఆవు దూడని విడిచి పెట్టగానే పాలు తాగడానికి తన తల్లి దగ్గరకి ఎలా పరుగు పెడుతుందో, పాపం అలా జీవుడి దగ్గరకు పరుగు పెడుతుంది. ఆవు దూడను విడిచి పెట్టగానే తల్లి దగ్గరకు ఎలా పరుగెత్తుకుని వెళ్ళిపోతుందో, ఇది తల్లి అని చెప్పక్కర్లేదు మనం, ఆ తల్లి దగ్గరకి పరుగెత్తుకుని వెళ్ళిపోతుంది. దాని తల్లి దానికి తెలుసు. అలాగే జీవుడు చేసిన పాపం కూడా ఎన్ని జన్మలలో వీడు ఎక్కడ దాక్కున్నా పరుగెత్తుకునివెళ్ళిపోతుంది. ఎక్కడున్నాడు, ఎక్కడున్నాడుఅని దూడ తల్లి దగ్గరకిపాలు తాగటానికి ఎలా పరుగు పెడుతుందో, ఈ జీవుడు చేత కర్మ అనుభవింప చేయటానికి అలా పరుగు పెడుతుంది. చాలామంది పాపాలు చెయ్యటానికి గర్వం కారణం.

భక్తి, దేవుడు, జ్ఞానం మాట అటు ఉంచండి. నువ్వు ఏ రంగంలో అభివృద్ధిలోకి రావాలి అన్నా ముందు వినయం నేర్చుకోవాలి. గర్వం ఉంటే ఆ మనిషి పాడైపోతాడు, పతనం అయిపోతాడు. పెద్ద పెద్ద సైంటిస్టులు కూడా ఎంత వినయంగా ఉంటారో మీకు తెలియదు. కొత్త కొత్త విషయాలు కనిపెట్టిన సైంటిస్టులు కూడా కొత్తగా విమానం కనిపెట్టనివ్వండి, రైలు కనిపెట్టనివ్వండి. వాళ్ళు ఎలా కనిపెట్టినా సరే భగవంతుడు మనకు కనిపెట్టే శక్తి ఇచ్చిన మూలాన మనం కనిపెట్టాం కాని లేకపోతే మన వల్ల కాదు అనేవారు. నేనువిమానం కనిపెట్టాను అని వాడికి గర్వం రాదండి, నేను రైలు కనిపెట్టాను అని వాడికి గర్వం రాదు. వాళ్ళు కూడా ఋషులు లాంటి వారు. ఏవండీ పొద్దున్న ఆరు గంటల నుంచి లాబొరేటరీలో పనిచేస్తూ, సరిగ్గా టైముకి భోజనం లేక రాత్రి పది గంటల వరకు మాడిపోయి మానవ జాతి కోసం శ్రమిస్తారు. ఇంటికాడ భార్య కాని, తల్లి కాని వాళ్లకి కూర చేసి, ఏదో ఒక కూర వండి ఆ లాబొరేటరీ కి పంపిస్తే, అసలు ఏమి కూర తింటున్నాంఅని మర్చిపోయిన సైంటిస్టులు కూడా ఉన్నారు. అన్నం తినకుండా అన్నం తినేశామేమో అని

అనుకునే సైంటిస్టులు ఉన్నారు. అంటే వాళ్ళ దేహం ఎక్కడ ఉందో, వాళ్ళ మనస్సు ఎక్కడ ఉందో, వాళ్ళ ఇంద్రియాలు ఎక్కడ ఉన్నాయో, తెలియకుండా ఈ ప్రకృతి రహస్యాలను ఛేదించి మనకు ఇస్తున్నారు వాళ్ళందరూ!

డబ్బు మంచిదే, చదువు మంచిదే కానీ వాటిలోని చెడ్డ ఏమిటి అంటే అవి మనిషిలో తొందరగా గర్వం తీసుకు వస్తాయి. తాచుపాములో విషం పిండేసిన తరువాత ఆ తాచుపాము మనలని ఏమి చేయదు. అదే విధంగా డబ్బులో ఉన్న గర్వం, చదువులో ఉన్న గర్వం పిండేస్తే అవి మనకు ఉపకారం చేస్తాయి కాని అపకారం చెయ్యవు. బాగా జ్ఞాపకం ఉంచుకోండి ఒక్క భక్తి విషయంలోనే కాదు మీ ఇష్టమొచ్చిన రంగం తీసుకోండి, మీరు ఏ రంగంలో అభివృద్ధిలోకి రావాలన్నా ముందు గర్వం లేకుండా చూసుకోండి. మీ పిల్లలకి కూడా అదే చెప్పండి. మీకు అహంకారం ఉంటే అహంకారం గురించి మనం చెప్పుకోవటం. మీకు ఎవరికీ అహంకారం లేదు కదా లేనప్పుడు ఎందుకండీ దాని గురించి మన కాలాన్ని ఖర్చు పెట్టుకోవడం. భాగవతాలు, రామాయణాలు, భారతాలు, పురాణాలు ఋషులు చెప్పేవి, ఇవన్నీ అహంకారాన్ని పోగొట్టుకోమని. ఉన్నవారు పోగొట్టుకుంటారు అనుకోండి మనకు లేదు కదా, రోగం ఉన్నవాళ్ళు రోగం పోగొట్టుకోవడానికి మందులు. మనకి లేదు కదా, అహంకారం, మీలో ఎవరికి అయినా ఉందా? అంతర్ముఖం చేసి ఒకసారి మనకు అహంకారం ఉందా అని ఆలోచించండి ఒక రెండు నిమిషాలు. ఊరికే పరుగెత్తుకుని వెళ్ళిపోవడం ఎందుకండి. ఇది బహిరంగ సభ కాదు, ఏదో ఒకటి చెప్పకు వెళ్ళిపోవటానికి ఇష్టా గోష్టి సమావేశం కాదు. మీరు ఆలోచించండి అహంకారం అంటే



**నువ్వు ట్రూత్‌ని రియలైజ్ చేయకుండా ఉన్న వస్తువుని ఉన్నట్లుగా ఎరుకలోకి తెచ్చుకోకుండా నీకు ఫ్రీడం లేదు. నో ఫ్రీడం ఫ్రమ్ రిబర్త్, నో ఫ్రీడం ఫ్రమ్ సారో!**

ఎలా ఉంటుందో, మీరు చెప్పగలగాలి, పోనీ ఉంది అనుకోండి ఉంటే మీకు ఎలా అనిపిస్తోంది? ఒకవేళ ఉందని మీరు అనుకుంటున్నారు అనుకోండి, ఇప్పుడే పోతుంది. మీరు ఆపరేషన్ చేయించుకోనక్కర్లేకుండా, మందు పుచ్చుకో నక్కర్లేకుండా టాబ్లెట్స్ వాడక్కర్లేకుండాపోతుందండీ ఉంటే. అది ఎలా అనిపిస్తుంది మీకు అసలు.

వేరుభావన వల్ల అంటే ద్వైతబుద్ధి వల్ల అహంకారం వస్తుంది. ఆ దేహం నీది, ఈ దేహం నాది అనుకోవడం వల్ల అహంకారం వస్తుంది. సర్వ సాధారణంగా అందరూ ఏమి అనుకుంటున్నారు అంటే కోపం వస్తే అహంకారం అని, చిరాకు వస్తే అహంకారం అని, అనుకుంటున్నారు అది కాదు. దేహం నేను అనుకోవటం అహంకారం. మనం అందరం దేహం నేను అని, అనుకుంటున్నాం కదా అందుచేత అందరికీ అహంకారం ఉన్నట్టు! దేహం నాది కాదు అనుకునేవాళ్ళు ఎవరైనా ఉన్నారా? దేహం పుట్టినప్పుడు పుట్టాం అనుకుంటున్నాం, దేహం మరణించినప్పుడు మరణించాం అనుకుంటున్నాం, దేహానికి రోగం వస్తే నాకు రోగం వచ్చింది అంటున్నాడు. అంటే ఏమిటి? దేహం తాను అని అనుకుంటున్నాడు కదా. దేహానికి జబ్బు చేసింది అనుకోండి వాడు నాకు రోగం వచ్చింది అనుకుంటున్నాడు. అంటే దేహం నేను అని అనుకుంటున్నాడు కదా ఈ దేహం నేను అనుకునే వాడు నిజంగా లోపల ఉన్నాడా? మీరు గాఢనిద్రలో ఉండగా ఈ దేహం నాది అని ఎవడైనా చెబుతున్నాడా. దేహాన్ని కాల్చేటప్పుడు కూడా దీనిని కాల్చద్దు అని ఎవరైనా అడుగుతున్నారా? ఎందుకు పోగొట్టుకోమంటున్నారు అహంకారం? ఉంటే నష్టం ఏమిటండి అసలు? ఉంటే ఎందుకు నష్టం అన్నారు అంటే అది నాకు దుఃఖం తీసుకు వస్తుంది, అశాంతి తీసుకు వస్తుంది. ఎదుటి మనిషి దుఃఖం తీసుకు వస్తున్నారు అని మీరు అనుకుంటారు అదంతా అబద్ధం. నా అహంకారం నాకు దుఃఖం తీసుకు వస్తుంది, నా అహంకారం నాకు అశాంతి తీసుకు వస్తుంది. నా అహంకారం దేహాన్ని తీసుకు వస్తుంది.

కాన్సర్ మీ శరీరాన్ని చంపుతుంది కాబట్టి కాన్సర్‌కి వైద్యం చేయించుకోమన్నారు. అహంకారం మీకు దుఃఖం తీసుకు వస్తుంది కాబట్టి, అశాంతి తీసుకు వస్తుంది కాబట్టి దానిని పోగొట్టుకోమన్నారు. కాని మనం ఏమి చేస్తాం? ఈ అహంకారాన్ని గాలికి వదిలేస్తున్నాం మనం, శరీరాన్ని పట్టుకుంటున్నాం. దేవుడిని ఏమి అడుగుతున్నాం? శరీరానికి

సంబంధించిన సుఖాలు ఇమ్మని అడుగుతున్నాం. అశాంతి, దుఃఖం తీసుకు వచ్చేది అహంకారమే. శరీరం తీసుకు రావటం లేదు. అశాంతిని అహంకారమే తీసుకు వస్తుంది. దుఃఖాన్ని అహంకారమే తీసుకు వస్తుంది. కాని నా అహంకారాన్ని పోగొట్టమని మనం ఈశ్వరుడిని అడగటం లేదు. దేహానికి సంబంధించిన సుఖాలు అడుగుతున్నాం.

నేరం ఎవరు చేస్తున్నారు? అహంకారం చేస్తుంది. శిక్ష ఎవరు అనుభవిస్తున్నారు? దేహం అనుభవిస్తోంది. మనం ఏది అడిగినా, దేహం కోసమే అడుగుతున్నాం. ఒక మనిషి పొరపాటు చేశాడు అనుకోండి, ఆ పొరపాటు ఎవరు చేస్తున్నారు? అహంకారం చేస్తుంది. ఆ పొరపాటు చెయ్యటం వలన వాడు తన్నులు తిన్నాడు అనుకోండి, దేహం తన్నులు తింటుంది. మనిషి పొరపాటు చేస్తుంటే వాడు అహంకారం తోటి చేస్తున్నాడు. అహంకారం వల్ల పొరపాటు చేస్తే ఆ పొరపాటు వల్ల వాడు తన్నులు తింటే ఎవరు తింటున్నారు? దేహం తన్నులు తింటుంది. మీ భక్తి కనీసం ఈ శరీరం దాటి, అహంకారం దాకా వెళ్ళిందా? అందరూ వెంకటేశ్వర స్వామి దగ్గరకు, రమణస్వామి దగ్గరకు వెళ్ళి దేహానికి సంబంధించినవి అడుగుతున్నారు కాని ఈ దేహాన్ని దాటి వెళ్ళి అహంకారాన్ని పోగొట్టుకోవాలి అనే సంకల్పం ఎవరికి అయినా వస్తోందా? మీలో అహంకారం ఉందండి, అహంకారం ఈశ్వరుడికి మేత కింద ఎందుకు పెట్టకూడదు? మీ డబ్బులు మీ దగ్గర ఉంచుకోండి. మీ చదువులు మీ దగ్గర ఉంచుకోండి. అన్నీ మీ దగ్గరే ఉంచుకోండి. దూడకి పచ్చగడ్డి ఎలా వేస్తామో అలా అహంకారాన్ని మీరు ఈశ్వరుడికి మేతగా ఎందుకు పెట్టకూడదు? ఈ దేహం అన్నం తింటుంటే, అన్నం లోంచి కొంత రక్తం కింద, మాంసం కింద, ఎముకలు కింద మారుతుంటే, కొంత మనసు కింద, అహంకారం కింద మారుతుంది అంతే! అది నిజంగా లేదు. ఈ దేహం ఎంత అబద్దమో, అహంకారం కూడా అంతే అబద్ధం. దేహం ఎటువంటి తలంపో అహంకారం కూడా తలంపే!

అహంకారం నిజంగా లేదు అండి, ఒకవేళ ఉంది అనుకోండి ఉంటే ఎవరూ పోగొట్టుకోలేరు. అహంకారం నిజమైన వస్తువు అనుకోండి, యదార్థమైన వస్తువుని ఎవరు పోగొట్టగలరు? అహంకారం లేనప్పుడు ఉందని ఊరికే ఊహించుకుంటున్నాం అలా ఊహించుకుంటున్నాం కాబట్టి దానిని పోగొట్టుకోవటానికి సాధన పెట్టారు. మీ అందరినీ

కూర్చోబెట్టి ధ్యానం నేర్పమని నాకు ఎవరో చెప్పారు. ధ్యానం ఎవరికి నేర్పాలి నేను? నేను ధ్యానం మీ అహంకారానికి నేర్పాలా? అంటే లేని దానిని ఉన్నట్టు నేను అనుకుని చెయ్యాలి అన్నమాట. దేహం అన్నం తింటుంటే దేహం ఎలా పెరుగుతుందో, అదే విధంగా ఈ ప్రకృతి లోంచి, ఈ రాగ ద్వేషాలు లోంచి, ఈ కామ క్రోధాలు లోంచి ఏదో ఒకటి ఈ శరీరంలో ప్రారంభమైంది, అది నిజంగా లేదు, ఉన్నట్టుగా అనిపిస్తుంది, అది దేహ పరిణామంలో ప్రారంభమైనది. దాన్ని విచారణ చేస్తే అది పోతుంది. అది కేవలం మొండితనంగా తపస్సులు చెయ్యటం వల్ల పోదు. మీరు ఎవరితోటి చేస్తారు సాధన? మీరు చేసే సాధన అహంకారం తోటే కదా, అది ఉంది అనుకుంటున్నారు కదా. అహంకారం తోటి సాధన చేస్తే ఆ సాధన అహంకారాన్ని చంపుతుందా? బాగా అర్థం చేసుకోండి ఏమి కంగారు పడకండి. అందుకే ఇష్టా గోష్టి ఉపన్యాసం కాదు అన్నాను. మీరు అహంకారం తోటి సాధన చేస్తారు. అహంకారం తోటే సాధన చేస్తుంటే ఈ సాధన వెళ్ళి అహంకారాన్ని ఎలా చంపుతుంది? మేము సాధన చేస్తున్నాం అంటున్నారు రైటే. మీరు ఎవరితోటి చేస్తున్నారు సాధన? మనసు తోటే కదా చేసేది. మరి మనసు చేసే సాధన మనసుని ఎలా చంపుతుంది?

నేను వెండి గ్లాసు తీసుకుని జేబులో వేసుకుని ఇంటికి పట్టుకు పోయాను అనుకోండి, ఏవండీ మా ఇంటికాడ గ్లాసు పోయింది అని మిరు నన్నే అడుగుతారు అనుకోండి నేను చెబుతానా? ఎవరు పట్టుకుపోయారో, లక్ష్మి పట్టుకు పోయిందా, అన్నపూర్ణ పట్టుకు పోయిందా ఎంక్వయిరీ చేద్దాం అంటాను. ఇంకొక నాలుగు రోజులు ఆగి మళ్ళీ అడిగారు అనుకోండి పోలీసు కేసు పెట్టమంటాను. నేను గ్లాసు పట్టుకుపోయిన మాట నిజమే, కాని నేనే మళ్ళీ వెళ్ళి పోలీసు స్టేషన్‌లో ఎవరు తీశారో నాకు తెలియదు అనిచెబుతాను.

మీరు సాధన చేస్తున్నారు, ఎవరికోసం చేస్తున్నారు? జ్ఞానం కలగడం కోసం చేస్తున్నారా? లేకపోతే దేహం కోసం చేస్తున్నారా? కొంతమంది భగవంతుడిని ప్రార్థించేటప్పుడు ఆరోగ్యం కావాలి అంటారు. కొంతమంది ఐశ్వర్యం కావాలి అంటారు. కొంతమంది విద్య కావాలి అంటారు. అంటే మీకు ఐశ్వర్యం కావాలో, విద్య కావాలో, ఆరోగ్యం కావాలో ఈశ్వరుడికి తెలియదా? అంటే మీకు ఉన్న తెలివి తేటలు కూడా ఈశ్వరుడికి లేవా? కావాలి అని అడిగేది ఎవరండి? నాకు ఆరోగ్యం కావాలి, నాకు ఐశ్వర్యం కావాలి,

నాకు ఇంకొకటి కావాలి అని లోపల అడిగేది ఎవరండి? నిజంగా మీ కోరికలను ఈశ్వరుడు తీరుస్తాడు అనుకోండి. ఎంత చిక్కు వస్తుందో చూడండి ఇక్కడ. నా బాధ కూడా మీరు అర్థం చేసుకోండి. ఈశ్వరుడు మీ కోరికలు తీరుస్తాడు. తీరిస్తే అహంకారం ఇంకా పెరిగిపోతుంది. ఎలా తీరుతుంది ఈ సమస్య? దేనితోటి ప్రార్థిస్తున్నారో మీకు తెలియక పోయినా, మీకు తెలిసున్నా అహంకారం తోటే ప్రార్థిస్తున్నారు. మనసుతోటేప్రార్థిస్తున్నారు. నిజంగా మీ కోరికలు తీరుస్తాడు అనుకోండి, తీరిస్తే మీకు అహంకారం పూర్వం ఉన్నదానికంటే పెరుగుతుంది. దీనికి స్వామి రామతీర్థ గారు ఒక కథ చెప్పారు దీనికి.

పూర్వం ఒకరు తినటానికి తిండి లేక పేదరికంతో చాలా ఇబ్బంది పడేవారట. వారు ఇబ్బంది పడినా ఏదోరకంగా భిక్ష చేసుకుని తిని కాలక్షేపం చేసేవారు. ఒకరోజున ఎవరు పడేసుకున్నాడో వారికి రోడ్డు మీద 99 రూపాయలు దొరికాయి. అంతకుముందు వరకు ఏదో దొరికింది తిని శుభ్రంగా హాయిగా ఉంటున్నారు. ఈ 99 రూపాయలు దొరికాక వారిలో ఆశ ప్రారంభం అయ్యింది. అంతకుముందు టైముకి తినేవారు భిక్ష చేసుకుని, ఈ 99 రూపాయలు దొరికాక మనం ఒక పూట అన్నం మానేసి అయినా సరే డబ్బు పెంచేయాలి అనుకున్నారు. ఆ రోజున 99 ని వంద చేశారు. తరువాత వందని రెండు వందలు చేశారు. రెండు వందలని మూడు వందలు చేశారు. అంతకుముందు హాయిగా తినేవారు కూడా ఇప్పుడు తినటం మానేసి ఎంతో లోభిత్వంగా తయారయ్యారు. ఆశ వలన ఎలా అయ్యారో చూడండి.

నాకు ఇది కావాలి, అది కావాలి అని అసలు ఈశ్వరుడిని అడగటం ఎందుకు?



**చాలామంది అహంకారాన్ని ఆత్మవిశ్వాసం అనుకుంటారు. ఆత్మవిశ్వాసం వేరు, అహంకారం వేరు. అహంకారి లిమిటెడ్‌గా ఉంటాడు. ఆత్మవిశ్వాసం ఉన్నవాడు అన్‌లిమిటెడ్‌గా ఉంటాడు. ఇద్దరికీ తేడా ఉంది. ఆత్మవిశ్వాసం ఉన్నవారు చాలా విషయాలు సాధించగలరు.**

నాకు ఇది కావాలి, అది కావాలి అని అడుగుతున్నారు అంటే, భగవంతుడికి condition పెడుతున్నారు అన్నమాట. condition ఎందుకండి? condition పెడుతుంటే అది భక్తా? మీరు ఈశ్వరుడికి కండిషన్ పెట్టి నాకు ఇది కావాలి అని అడుగుతున్నారు అనుకోండి అది ప్రేమ అంటారా? జ్ఞానం అంటారా? వైరాగ్యం అంటారా? మీలో రామాయణం చదువుకున్న వారు ఉన్నారు, భాగవతం చదువుకున్న వారు ఉన్నారు, సుందరకాండ చదువుకున్న వారు ఉన్నారు. మీరు నాకు ఇది కావాలి అని భగవంతుడిని అడుగుతారు అనుకోండి. అలా అడిగితే దానిని జ్ఞానం అంటారా? ప్రేమ అంటారా? వైరాగ్యం అంటారా? ఇంకొక చిన్న విషయం ఎంత పసిపిల్లల చేష్టలలో ఉందంటే మన భక్తి. మనం ఏదో ఒక మొక్క వేశాం, కొబ్బరి మొక్కో, నిమ్మమొక్కో, ఏదో ఒక మొక్క వేశాం. మొక్క వేసిన వెంటనే కాయ కాసేస్తుందా? దానికి నీళ్ళు పోయాలి. దానికి పురుగులు పట్టకుండా ఎండ్రిన్ కొట్టాలి. దాన్ని ఎంతో పోషిస్తే ఆ మొక్క ఫలితాన్ని ఇస్తుంది. ఆ ఫలితం వచ్చే లోపల మొక్క వేశాం ఇంకా మాకు ఫలితం ఇవ్వటం లేదు అని కంగారు పడితే ఎలాగ? నిజంగా మీరు కోరిక కోసం భక్తి చేస్తున్నారు అనుకోండి మీ భక్తి ఫలితాన్ని ఇచ్చే వరకు మీరు ఆగక్కరలేదా? మీకు జ్ఞానం అక్కర్లేదు, కోరికలు పెట్టుకుని మీరు భక్తి చేస్తున్నారు అనుకుందాం. మీరు వేసిన మొక్క అయినా కాయలు కాయటానికి టైము తీసుకుంటుంది కదా. ఆ టైము కూడా భగవంతుడికి ఇవ్వరు అన్నమాట మీరు. మీరు పాదు పెట్టారు. ఒక నెలో, రెండు నెలలో, మూడు నెలలో పడుతుంది కదండీ చిక్కుడు కాయలు కాయటానికి, అలాగే భగవంతుడిని భక్తి దృష్టి తోటి మీరు ఏది అడిగినా ఆ భక్తి మీకు ఫలితాన్ని ఇచ్చేవరకు మీరు ఆగరా?

చాలామంది దేవుడిని వరాలు అడుగుతారు. ఈ వరాలే సంసారాన్ని పెంచుతాయని, ఈ వరాలే కొంపలు ముంచుతాయని వారికి తెలియదు. ఒక్కటే జ్ఞాపకం ఉంచుకోండి. ఎవరైతే దేవుడిని వరాలు అడుగుతున్నారో ఆ వరాలే తిరిగి వచ్చి ఈ భక్తుడి నాశనానికి కారణం అవుతాయి. సూర్యుడు సరిగ్గా టైముకి ఉదయిస్తాడు. టైముకి అస్తమిస్తున్నాడు. మనల్నిఏమి అడుగుతున్నాడు? రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు సైకిల్ కాని, కారు కాని ఎడమ వైపున వెళ్ళాలి. రోడ్డుకి ఎడమ వైపు ఎందుకు వెళ్ళాలి అంటే అది government

పెట్టింది. ప్రమాదాలు జరగకుండా అలా ఏర్పాటు చేశారు. కాశీలో మరణిస్తే ముక్తి అని, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి అని అలా ఎందుకు పెట్టారు అని రమణస్వామిని అడిగితే, అది ఈశ్వర ఆజ్ఞ అడగటానికి నువ్వు ఎవరవు అన్నారట.

మీకు సంవత్సరాలు అక్కర్లేదు, నెలలు అక్కర్లేదు, సెకన్లలో మోక్షాన్ని పొందుతారు. నేను రహస్యం చెబుతాను మీరు ఎవరితో చెప్పకండి. చాలా మోస్ట్ సీక్రెట్. మనసులో పవిత్రత లేని వాడికి ఎన్నడూ శాంతి రాదు. వాడికి ఎంత చదువు ఉన్నా సరే, ఎంత ధనం ఉన్నా సరే, మనసులో కనుక పవిత్రత లేకపోతే వాడికి శాంతి ఎన్నడూ రాదు. వాడికి అన్నం కరువు లేకపోవచ్చు, బట్టలు కరువు లేకపోవచ్చును కాని, లోపల మనసులో కనుక పవిత్రత లేకపోతే ఇరవై నాలుగు గంటలు వాడికి శాంతి కరువు. మీరు ఒక పొరపాటు చేస్తున్నారు మీకు ఇంటినిండా వస్తువులు ఉంటే శాంతి వచ్చేస్తుంది అనుకుంటున్నారు. మీ మనసులో పవిత్రత లేకుండా మీ ఇంటి నిండా వస్తువులు ఉన్నంత మాత్రం చేత మీకు ఎన్నడూ శాంతి రాదు, రాదు, రాదు. ఇది చాలా రహస్యమైన విషయం మీరు మనసులో పెట్టుకోండి. ప్రకృతి గర్భంలోంచి శాంతి పుట్టదు. శాంతి కోసం ఎంతకాలం అయితే మీరు ప్రకృతి మీద ఆధారపడి ఉంటారో, అలా కోటిజన్మలు ఎత్తినా ప్రకృతి మీకు దారి ఇవ్వదు. మనం దాని మీద ఆధారపడ్డాం ఇంక అది మనలను ఎలా విడిచి పెడుతుంది?

మీరు వారానికి ఒకరోజు ఇక్కడకు వస్తున్నారు అని ఎవరైనా మిమ్మల్ని ఆక్షేపిస్తుంటే, ఆ ఆక్షేపించేవాడు వారానికి ఒకరోజు సినిమాకు ఎలా వెళుతున్నాడు? కొంతమంది డబ్బులు లేవండి చాలా ఇబ్బంది పడిపోతున్నాం అంటారు. మరి సిగరెట్లకి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? సినిమా చూడటానికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? సారా తాగడానికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఇవన్నీ డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి ఇంద్రియాలు అసలు బయటకి ఎందుకు చలిస్తున్నాయి. బహిర్ముఖం ఎందుకు అవుతున్నాయి. ఒక్కటే గుర్తుంచుకోండి బండతనంగా కూడాచెయ్యద్దు. మీరు సాధన పూర్తిగా మానేసినా నాకు ఇష్టమే, బండతనంగా మటుకు ఇందులోకి వెళ్ళద్దు. మీరు బండతనంగా చేస్తే వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసినా ఇది పోదు. విషయం అర్థం

చేసుకుంటే అప్పుడు పోతుంది. విషయాన్ని అర్థం చేసుకోకుండా వెయ్యి సంవత్సరాలు చేసినా అంతే. బండతనంగా మటుకు మీరుఏమిచెయ్యద్దు.

అసలు ఇంద్రియాలు బయటకి ఎందుకు వెళుతున్నాయి? మీకు సినిమా చూడాలని సంకల్పం వస్తుంది. ఎందుకు వస్తుంది సినిమా చూడాలని? అంటే సినిమాలో కూర్చుంటే కొంచెం శాంతిగా ఉంటుంది, మనసు కుదురుగా ఉంటుంది, సుఖంగా ఉంటుంది అనిపిస్తుంది. అంటే ఏమిటి? సుఖం మీలో లేదు అని అర్థం అవుతోంది కదా. మీరు ఒకరి దగ్గరకి బాకీకి వెళుతున్నారు అంటే మీ దగ్గర డబ్బు లేదని తెలిసిపోతుంది కదా. నేను ఎవరిని అయినా పది రూపాయలు అడిగాను అనుకోండి నా దగ్గర డబ్బు లేదు అని అర్థమే కదా, నా దగ్గర డబ్బు ఉంటే నేను అడగను కదా. సినిమాకి వెళ్ళి సుఖం తెచ్చుకుంటున్నాను అంటే నా లోపల సుఖం లేదు అని తెలిసిపోతుంది కదా. ఇలా ఎంతకాలం ఆధార పడి ఉంటారండి సుఖం కోసం సినిమాల మీద? నేను అసలు సుఖాన్నా? దుఃఖాన్నా? సుఖం కోసం నేను ఎందుకు బయట వెతుకుతున్నాను? ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి. నాకు డబ్బు ఉందని కొత్త అలవాట్లు నేర్చుకుంటే కొత్త అలవాట్లు కొత్త వాసనల కింద మారిపోయి కొన్ని జన్మలు మనల్ని గొలుసు వేసి కట్టేస్తూ ఉంటాయి. అంటే డబ్బు మనకి ఉపకారం చేస్తోందా? అపకారం చేస్తోందా?

రాజేంద్రప్రసాద్ ఒకసారి భగవాన్ దగ్గరకు వచ్చి పది రోజులు ఉన్నారట. ఆయన మహా మేధావి. అంత చదువు ఉండి భగవాన్ దగ్గర ఆయన పిల్లిలా ఉండేవారట. మనకు డబ్బు జేబులో ఒక్క రూపాయి ఉంటే పిల్లిలా ఉంటామా మనం? ఆయనకి ఎన్నో ఉన్నాయి, చదువు ఉంది, అధికారం ఉంది. పోనీ అంత చదువు అక్కర్లేదు మనకిజేబులో ఒక్క రూపాయి ఉంటే మనల్ని పిల్లి కింద ఉండనిస్తుందా. రాజేంద్రప్రసాద్ కి అంటే, చదువు ఉందదండి, అధికారం ఉందదండి, డబ్బు ఉంది అనుకోండి. మనకు చదువు లేదు, అధికారం లేదు, డబ్బు ఒక్కటే ఉంది అనుకుందాం. మనం పిల్లిలా కూర్చోగలమా?

మీరు ఏ విషయం గురించి బాధ పడకండి. మీ దేహం యొక్క సంస్కారం బట్టి మీకు ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. మీ గురించి మీరు ఆలోచించుకోవడం

మానేస్తే ఈశ్వరుడు ఎప్పుడూ మీ గురించి ఆలోచిస్తాడు. ప్రతిక్షణం మీకు మీరే జ్ఞాపకం వస్తుంటే ఈశ్వరుడికి టైము ఏమి ఇస్తున్నారు మీరు? ప్రతి సెకను మీ గురించి మీరే ఆలోచించుకుంటే ఈశ్వరుడికి ఇంక టైము ఏది మీ గురించి ఆలోచించటానికి? అవకాశం ఇవ్వాలి కదా మీరు. డాక్టరు గారి దగ్గరకు వెళ్ళారు అంటే నాడి చూడటానికి చెయ్యి అందివ్వాలి కదా అసలు. మీ గురించి మీరు ఆలోచించుకోవటం మానేస్తే మీకు తెలియకుండానే మీరు క్రమంగా మహోన్నత స్థితికి చేరుకుంటారు. అయితే మనకు ఆత్మ కేంద్రమా? దేహం కేంద్రమా? అహంకారం కేంద్రమా? నేను ఆత్మ అయినపుడు అహంకారం కేంద్రంగా, దేహం కేంద్రంగా ఎందుకు పెట్టుకున్నాను నేను? నాకు ఏది మంచిదో నాలో ఉన్న నిజమైన ఆత్మకి తెలియదా? మీ మాట వదిలేయండి. నాకు ఏది మంచిదో నాలో ఉన్న ఈశ్వరుడికి తెలుసా? నాలో ఉన్న అహంకారానికి తెలుసా?

ప్రపంచంలో మనుషులందరూ కూలి వాళ్ళండి. ఏదో ఒక ప్రయోజనం లేకుండా పనిచేసే మనిషిని చూపించండి. చదువు సంపాదించుకోవడానికి సంవత్సరాలు తరబడి ఖర్చు పెట్టుకుంటున్నారు కదా, అలా డబ్బు సంపాదించుకోవడానికి సంవత్సరాలు తరబడి ఖర్చు పెట్టుకుంటున్నారు కదా, కీర్తి సంపాదించుకోవడానికి సంవత్సరాలు తరబడి ఖర్చు పెట్టుకుంటున్నారు కదా, మీ కాలాన్ని ఇక్కడ ఒక గంటసేపు ఖర్చు పెట్టుకోవడానికి మీకు బరువుగా ఉందా? మీరు మరణించినప్పుడు ఈ గంట కలిసి వస్తుందా? మిగతా మీరు

**మనకి సొంతమంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. మనకి భగవంతుడు ఇస్తేనే వస్తుంది, లేకపోతే ఏమీ రాదు. కానీ భగవంతుడు ఇచ్చింది ఆయన ఇచ్చాడు అనుకోకుండా మన సొంతమని మనకి అనిపిస్తోంది. మీకు భగవంతుడు ఏమైనా ఇచ్చినా అది మీ సొంతం అనుకోవద్దు. భగవంతుడు ఇచ్చిన వరాలు అనుకోండి.**



ఖర్చు పెట్టిన గంటలు కలిసి వస్తాయా? మీకు కంగారు ఎందుకు వస్తోంది? మనిషి కంగారు పడవలసిన పని ఏముంది అసలు? ఏ విషయం గురించి అయినా సరే కంగారు పడవలసిన పని ఏమిటి? కంగారు పడటం వలన వాడు ఏదైనా సాధించగలడా? మీరు అనుకున్నవి అన్నీ మీరు కంగారు పడటం వలన సాధించగలరా? సాధించలేరు. మరి ఎందుకు కంగారు పడుతున్నారు? మీ దేహాన్ని మర్చిపోయి, మీ ధనాన్ని మర్చిపోయి, మీ అహంకారాన్ని మర్చిపోయి, మీ మనస్సుని మర్చిపోయి, మీ కీర్తి ప్రతిష్టలని మర్చిపోయి, ఇవన్నీ ప్రక్కన పెట్టి మీరు ఎప్పుడైనా ఎవరికైనా ఏమైనా సహాయం చేశారా జీవితంలో? ఈ కూలి వాళ్ళకా మోక్షం ఇచ్చేది ఈశ్వరుడు? ఆయనకు మోక్షం ఇవ్వడానికి ఎవరు దొరకలేదా? కూలివాళ్ళకా. మిమ్మల్ని మీరు మర్చిపోయి ఎదుటి వాళ్ళు గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఎదుటి వాళ్ళు గురించి మీరు ఆలోచించేటప్పుడు అయినా మిమ్మల్ని మీరు ఎప్పుడైనా మర్చిపోయారా అసలు? పోనీ ఆ పది నిమిషాలు. మీ జీవితంలో అటువంటి సన్నివేశాలు ఎప్పుడైనా ఉన్నాయా?

మీ మనస్సులో వచ్చే చిన్న చెడు తలంపుకి కూడా ఏదో ఒక రోజున మీరు answer చెప్పాలి. మీరు నోటి తోటి మాట చెప్పక్కర్లేదు. చేతి తోటి పని చెయ్యక్కర్లేదు. మీ మనసులో వచ్చే చిన్న చెడు తలంపుకి కూడా మీరు ఎప్పుడో ఒకప్పుడు ఈశ్వరుడుకి సమాధానం చెప్పితీరాలి. నా మాటలని మీరు ఎలా రికార్డు చేస్తున్నారో, అలా మనసులో వచ్చే ప్రతీ తలంపుని కూడా భగవంతుడు రికార్డు చేసి ఉంచుతాడు. మీరు మర్చిపోవచ్చు కాని ఆ తలంపు వచ్చినట్టు ఆయన రికార్డు చేసి ఉంచుతాడు. ఇవాళ నేనుఏదో మాట్లాడుతున్నాను. నేను అలా చెప్పలేదు అంటే కుదురుతుందా మొన్న ఆదివారం ఇలా చెప్పారు అనినాకు అది వినిపిస్తారు. అలాగే మనకు వచ్చే ఆలోచనలు మనమే మర్చిపోవచ్చు కానీ భగవంతుడు మటుకు రికార్డు చేసి ఉంచుతాడు. ఎక్కడ రికార్డు చేసి ఉంచుతాడు? హృదయంలోనే రికార్డు చేసి ఉంచుతాడు.

భగవంతుడు కంటే పరమ లోభి మెరుగు. భగవంతుడు ఎంత లోభి అంటే పరమ లోభి తన పైసలని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో భగవంతుడు కూడా అటువంటి లోభి. మీకు వచ్చిన ఆలోచనల్లో తొంభై తొమ్మిది ఆలోచనలు జాగ్రత్తపెట్టి పోనీ మిగతా ఆలోచన

విడిచి పెట్టేయచ్చు కదా. అలా కాదు వందకి వంద జాగ్రత్త పెట్టి ఉంచుతాడు. మరి లోభి మెరుగా? భగవంతుడు మెరుగా? లోభే మెరుగు. ఎప్పుడైనా ఎక్కడైనా ఏదైనా పడిపోయినా దానం చేశాను అనుకుంటాడు. భగవంతుడు మీద పరమ లోభి మెరుగు. ఎందుచేత అంటే మీకు వచ్చే ప్రతీ చిన్న ఆలోచన మర్చిపోడు. హృదయంలో రికార్డు చేసి ఉంచుతాడు. మీరు ఎంత చదువు చదువుకున్నా, హృదయంలో కనుక దోషం ఉంటే మీకు దారి ఇవ్వడు, మీరు ఏమి చదువుకోండి, పది PHDలు పుచ్చుకోండి మీకు దారి కనపడదు.

కాపవరం గీతా జయంతికి ఒక పెద్ద చదువుకున్న ఒక స్వాములవారు చెప్పారు. ఆయన సన్యాసం తీసుకున్నారు. బాగా చదువుకున్నారు సంస్కృతం బాగా వచ్చు. ఇది మీకు ఎందుకు చెబుతున్నాను అంటే విమర్శించడం కోసం చెప్పటం లేదు, ఉదాహరణకి చెబుతున్నాను. ఆయన భీమవరంలో ఒకరి దగ్గర ఏమన్నారు అంటే ఏవండీ రమణస్వామి జీవించి ఉండగా రమణాశ్రమానికినేను వెళ్ళాను. ఆయనకి జ్ఞానం కలగలేదు, సమాధి కలగలేదు అని చెప్పారట. ఆయన ఎంత చదువుకున్నప్పటికీ ఆయన హృదయంలో ఉన్న దోషమే ఆయనకి దారి ఇవ్వటం లేదు. ఇంకొక చిన్న రహస్యం చెబుతాను. నేను ఇప్పుడు చెప్పిన ఆయన కూడా నాకు గురువే. ఇది విమర్శ కోసం చెప్పటం లేదు. ఆయన కూడా ఎందుకు గురువు అంటే కళ్లలో దోషం ఉంది అనుకోండి కళ్లలో దోషం ఉంటే లోపల ఆత్మలో దోషం ఉందని అర్థం కాదు, కొంతమందికి చెవులు సరిగ్గా వినపడవు. చెవులు సరిగ్గా వినపడకపోతే లోపల చెవుల్లో ఉన్న దోషం కానీ లోపల ఆత్మ చెవిటిది అని కాదు. అదే విధంగా కొంతమందికి బుద్ధి సరిగ్గా పనిచేయదు. వంకర బుద్ధి ఉంటుంది. అంటే బుద్ధికి వంకరతనం ఉంటుంది, కాని ఆత్మకి వంకరతనం లేదు. ఎంత చదువుకున్న వాళ్లకి అయినా మోకాళ్ళ నొప్పులు ఎలా వస్తాయో, కళ్ళలో దోషం ఎలా వస్తుందో, చెవుల్లో దోషం ఎలా వస్తుందో, బుద్ధిలో కూడా దోషం అలా వస్తుంది అన్నమాట. వాడి బుద్ధిలో ఉన్న దోషం వాడిని ఏడిపించేస్తుంది. దోషం బుద్ధిలో ఉంది కానీ ఆత్మలో లేదు. అందుచేత ఆయన కూడా ఇక్కడ గురువే నాకు. ఇది చెబితే నేను కంగారు పడిపోతాను అనిఒక డాక్టరు గారు ఈ విషయం నాతో చెప్పారు. నిజంగా రమణస్వామికి జ్ఞానం లేదు అనుకోండి మాటవరసకు అనుకొందాము. అయితే మీకు నాకు కంగారు ఎందుకు? మీరు నేను


కంగారు పడవలసిన పని ఏమిటండి అసలు?

అంటే ఏమిటి మీరు ఎంత గొప్ప చదువు చదువుకున్నా సరే మీ బుద్ధిలో ఉన్న దోషం దారి ఇవ్వదు. చదువుకి, దానికి ఏమి సంబంధం లేదు. భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాలు మీ నోటికి వచ్చేయవచ్చు. శబ్దానికి అర్థం చెప్పగల శక్తి మీకు ఉండవచ్చు. కాని భగవద్గీతలో భగవంతుడు ఏమిచెప్పాడో హృదయంలో తెలియనివ్వడు. కారణం మీ బుద్ధిలో ఉన్న దోషం. భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాలు నోటికి వచ్చినవాడికి కూడా అందులో ఏముందో అసలు వాడికి తెలియదు. ముందు ఇంజను కదులుతుంటే వెనకాల పెట్టెలు కదులుతాయి చూడండి. అలా కొంతమంది చదువుకుంటూ వెళ్ళిపోతారు, కానీ అందులో ఏముందో పాపం వాళ్ళకు తెలియదు. పోనీ అలా చదవడం మంచిదే, అలా చదవగా, చదవగా ఎప్పటికైనా అందులో ఏముందో తెలుసుకోవాలని బుద్ధి కలిగితే కలగవచ్చు. అసలు చదవక పోవటం కంటే చదవటం మంచిదే కదా. అసలు మాటలు రానివాడి కంటే కొంచెం నత్తిగా మాట్లాడినా ఫరవాలేదు.

ఏ ఇంద్రియం ఎందుకు బాధ పెడుతుందో మీరు ఆలోచించండి. మీరు కంగారు పడి రాముడి మీదో, కృష్ణుడి మీదో గెంటేయకండి. జాగ్రత్తగా అర్థం చేసుకోండి మిమ్మల్ని ఏ ఇంద్రియం అయితే బాధ పెడుతుందో చూసుకోకుండా ఏదో భయం పెట్టుకోవటం లేకపోతే కృష్ణా, కృష్ణా అనుకోవటం, సినిమాకు వెళ్ళిపోవటం ఇలా ఏదో ఒకటి చేసి మనసు తప్పించేస్తున్నారు. అలా పారిపోవటం ఎందుకు అసలు? ఎన్నాళ్ళు పారిపోతారు మీరు? నా దగ్గర నుంచి మీరు పారిపోవచ్చు మీ మనసు దగ్గర నుంచి మీరు ఎలా పారిపోతారు? ఇక్కడ నుంచి పారిపోయి పాలకొల్లు వెళ్ళిపోతారుఅనుకోండి మీ మనసు మీ కూడా పరుగెత్తుకుని వచ్చేస్తుంది కదా. ఏదో కాశీ వెళ్ళిపోదాం, అరుణాచలం వెళ్ళిపోదాం, రామేశ్వరం వెళ్ళిపోదాం ఇలా అనుకోవటం కూడా తలంపే. మనం మనల్ని పరిష్కరించుకోలేక కాసేపు విశ్రాంతి కోసం అదొక ప్రయాణం మనకి. కాసేపు రెస్ట్ అన్నమాట. బొత్తిగా మనసేమి బాగోలేదు అంటే డాక్టర్లు కూడా అంటారు పది రోజులు ఎక్కడైనా ఉండి రండి, ఏ బెంగళూరో ఎక్కడికైన వెళ్ళి రండి కాస్త వాతావరణం మారుతుంది, ఆరోగ్యంగా ఉంటారు అంటారు.

అసలు మీరు ప్రశాంతంగా కూర్చుని మీ మనసుని మీరు ఎందుకు ఎదుర్కోలేరు? మన మనసుని మనం ఎదుర్కోలేక పోతున్నాం అంటే మన మనసుకి ఉన్న బలం మనకు లేనట్టే కదా, అంటే మనసుకి లొంగి పోయినట్టే కదా. మన బలం తగ్గుతుంది, మనసు బలం పెరుగుతుంది. అంటే మనసుకున్న శక్తి కూడా నాకు లేదు అన్నమాట. ఆ శక్తి లేక నేను రాముడినో, కృష్ణుడినో, యేసుక్రీస్తునో ఆశ్రయిస్తున్నాను. నడిచే ఓపిక లేదు అంటే చేతిలో కర్ర ఉండాలి కదా.

ఒకతను నేను ఇంత చదువు చదివాను, నాకు ఆ డిగ్రీ ఉంది, ఈ డిగ్రీ ఉంది, అని అందరికీ చెపుతున్నాడు. సరే నీ చదువు అంతా పూర్తి అయిపోయింది ఏమి చేస్తావు అంటే, ఏమి లేదు ఉద్యోగం వచ్చేస్తుంది నాకు అన్నాడు. పోనీ రేపో, ఎల్లుండో నీకు ఉద్యోగం వచ్చేస్తుంది తరువాత ఏమి చేస్తావు అన్నారు? తరువాత పెళ్లి చేసుకుంటాను అన్నాడు. తరువాత ఏమి చేస్తావు అన్నారు? సంతానం, సంసారానికి సిద్ధం అవుతానుఅన్నాడు. మరి తరువాత ఏమి చేస్తావు? తరువాత రిటైర్ అయిపోతాను. తరువాత ఏమి చేస్తావు అంటే చచ్చిపోతాను. ఇదేమిటయ్యా నువ్వు చాలా చదువుకున్నావా, పెళ్లి చేసుకున్నావా, పిల్లలు కన్నావా, డబ్బు సంపాదించావా, రిటైర్ అయిపోయావా ఇదంతా ఈ చచ్చిపోవడం కోసమా? వాడే చెబుతున్నాడు నేను చచ్చిపోతాను అని. ఏమి చేస్తాడు అండి చచ్చిపోక పాపం. నీ నోటితో నువ్వే చెబుతున్నావు కదా చచ్చిపోతాను అని, పెళ్లి చేసుకోవడం, డబ్బు



వ్యాసుడు మహాభారతంలో ఒక మాట చెప్పాడు.

ఏ మతస్థుడైనా ఏ కులస్థుడైనా ఏ ప్రాంతం వాడైనా,

స్త్రీ అయినా పురుషుడు అయినా, వాడు ఎవడైనా సరే,

వాడు ఎంత సాధన చేసినా, ప్రపంచములో ఇంతవరకూ

ఏ స్వార్థపరుడికీ ఆత్మజ్ఞానం కలగలేదు.

వాడికి స్వరూప సుఖం తెలియదు.

సంపాదించడం, చచ్చిపోవడం కోసం సంపాదిస్తున్నావా ఇవన్నీ? అంటే జీవితం అంటే అర్థం ఇంతేనా? మనం తిన్నంత తిండి ఉంటుంది, కట్టుకోవడానికి గుడ్డ ఉంటుంది, చూడటానికి సినిమాలు ఉంటాయి. మనకు ఎన్ని భోగాలు కావాలి అంటే అన్ని భోగాలు చేతికి ఎదురుగా ఉంటాయి. అలా పోనీ శుభ్రంగా కావలసినది తిని, కట్టుకోవాలనుకున్న గుడ్డ కట్టుకుని వందేళ్ళు బ్రతికి చచ్చిపోతాం అనుకోండి అంతే అన్నమాట జీవితం. దేవుడు ఉన్నాడా? లేడా? వదిలేయండి. దేవుడిని కాసేపు పక్కన పెట్టండి. దేవుడి మాట తరువాత చూద్దాం. ప్రతీ దానికి దేవుడిని లాక్కు రాకండి. ఆయనని సుఖంగా ఉండనివ్వండి.

ముందు మన సమస్య ఏమిటి? మనకు ఇలా సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి. మీరు దేవుడికి పూజ చేసినా, దేవుడిని ప్రార్థించినామీకోసం చేస్తున్నారు. దేవుడి కోసం మీరు చెయ్యటం లేదు. అది మీకు తెలియటం లేదు. మీరు దేవుడి కోసం చేస్తున్నారు అనేది అబద్ధం. మీ ప్రార్థన మీ కోసం, మీ పూజలు మీ కోసం, మీ జపాలు మీ కోసం, మీ ధ్యానాలు మీ కోసం, ఇవన్నీ మీకోసం మీరు చేసుకుని దేవుడి మీదకి గెంటేస్తున్నారు. పోనీ ఆయన ఏమీ పెట్టడు, ఏమైనా complaint పెడతాడా నా మీద గెంటేస్తున్నారు ఇవన్నీ అని. మీరు routineగా గొలుసు కట్టుగా చేసుకుపోతున్నారు. పూజ అలా చేసేస్తున్నారు, జపం అలా చేసేస్తున్నారు, అన్నీ అలా చేసేస్తున్నారు. నాకు అన్నీ సుఖంగా ఉన్నాయి అనుకోండి. దేశంలో దారిద్ర్యం లేదు నాకు అన్నీ సుఖంగా ఉన్నాయి అండి ఈ చేతిలో ఒక ఫోను ఉంది, ఆ చేతిలో ఒక ఫోను ఉంది. ఈ ఫోనులో ఇలా మాట్లాడేస్తూ ఉంటాను, ఆ ఫోనులో అయితే అలా మాట్లాడేస్తూ ఉంటాను. అన్నీ సుఖంగా ఉన్నాయి. తరువాత చచ్చిపోతాం. ఇదేనా జీవితం అంటే? ఇదే గమ్యమా? మీరు ప్రశాంతంగా ఆలోచించండి.

ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు. వాడు మన భారాన్ని మోస్తున్నాడు. వాడు మన మంచి చెడ్డలు చూస్తున్నాడు అనే పూర్ణ విశ్వాసం మీకు ఉంటే మీకు అసలు భయం ఎందుకు వస్తుంది? దేవుడు లేడు అని చెప్పే వాళ్ళ మాట వదిలేయండి. దేవుడు ఉన్నాడు అని నమ్మే వాళ్ళకు కూడా భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నమ్మే వాళ్లకి కూడా నిజంగా వాళ్ళు నమ్ముతుంటే వాళ్ళకు భయం ఎందుకు వేస్తోంది? అది కూడా అబద్ధమే. వీడు నోటి తోటి అంటున్నాడు దేవుడు ఉన్నాడు, దేవుడు ఉన్నాడు అని. వాడు

అంటాడు నోటితోటి దేవుడు లేడు, దేవుడు లేడు అని. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి దేవుడి గురించి తెలియదు. దేవుడు లేడు అని చెప్పేవాడికి దేవుడి గురించి తెలియదు. వాడికి తెలియక మాట్లాడుతున్నాడు. వీడికి తెలియక మాట్లాడుతున్నాడు. దేవుడు ఉన్నాడు అనేది వీడికి అనుభవం లేదు. దేవుడు లేడు అనేది వాడికి అనుభవం లేదు. దేవుడు లేడు అని చెప్పేవాడు కూడా దేవుడిని చూడాలి కదా, అసలు చూడకుండా ఉన్నాడా, లేడా అనేది ఎలా తెలుస్తుంది? మీరు దేవుడు లేడు అని చెప్పటానికి కూడా మీరు దేవుడిని చూడాలి. ఉన్నాడు అని చెప్పటానికి చూడాలి. పోస్టుమాష్టారు ఆఫీసులో ఉన్నారా, లేదా చెప్పడానికి చూసిన తరువాత కదా ఉన్నారా లేదా చెప్పడం. చూడకుండా ఉన్నారని చెప్పలేను, లేరని చెప్పలేను. భక్తి ముదిరితే దేవుడు ఉన్నాడు అని చెప్పినా, లేడు అని చెప్పినా ఇంక అసలు చలనం ఉండదు. లేత మొక్కలకే భయం అండి. లేత మొక్కను దూడలు తినేస్తాయి కాని ముదురుపోయిన చెట్టుని దూడలు ఏమి చేస్తాయి? అసలు మీ మనసు ఒక స్థాయికి వచ్చిన తరువాత దేవుడు ఉన్నాడుఅని, లేడుఅని రెండు మాటలు మీకు సమానంగా కనిపిస్తాయి. కొంతమంది పని చేసేటప్పుడు I am tired, నేను అలిసి పోయాను అంటారు. శరీరంలో విటమిన్లు సరిపడా ఉంటాయి కానీ అలిసి పోయినట్లు ఎందుకు అనిపిస్తుంది అంటే ఈ పని నేను చేస్తున్నాను, ఈ పని నేను చేస్తున్నాను అనే భావన వాడిని tired చేసేస్తుంది.

పోనీ ఆరోగ్యంగా లేనివాడికి విటమిన్ లోపం అనుకుందాం. శరీరం ఆరోగ్యంగా ఉన్నవాడికి కూడా అస్తమాను ఈ పని నేను చేస్తున్నాను, ఈ పని నేను చేస్తున్నాను అని మనసులో అనుకుని వీడు tired అయిపోతాడు. మీకు ఏమి అక్కర్లేదు, మీరు వంతెన దగ్గరకి నడిచి వెళ్ళాలి కదా, ఇవాళ ఏమి చేస్తారు అంటే అడుగులు లెక్క పెట్టుకుంటూ వెళ్ళండి. మామూలుగా నడిచి వెళ్ళిపోతే మీకు ఏమి tired అయినట్టుగా అనిపించదు. అడుగులు లెక్క పెట్టుకుంటూ వెళితే చాలా శ్రమ అనిపిస్తుంది. అంటే మీరు పని naturalగా చేస్తే మీకు tired అయినట్టు అనిపించదు. నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అని మనసులోని భావన మనల్ని tired చేస్తుంది.

భాగవతం పోతనామాత్యుడు రాశాడు. శ్రీనాథుడు, పోతనామాత్యుడు ఇద్దరు బావా, బావమరుదులు. పోతన మహా భక్తుడు, శ్రీనాథుడు కూడా గొప్పకవే కాని మాటలలో, కొంత ఎగుడు దిగుడుగా మాట్లాడతాడు. కొంతమందికి ఆక్షేపణే ప్రధానం. బావ నువ్వు భాగవతం బాగానే రాశావు కానీ ఆ గజేంద్రుడిని రక్షించటానికి వచ్చినప్పుడు విష్ణువు చేతిలో శంఖం లేకుండా, చక్రం లేకుండా వచ్చేశాడు. మరి చక్రం లేకుండా వచ్చేస్తే గజేంద్రుడిని ఎలా రక్షిస్తాడు? ఆ పద్యం బాగోలేదు, అదేమి కవిత్వం అని ఏదో ఆక్షేపించాడు. పోతనామాత్యుడు పరమ భక్తుడు, అతనికి రజోగుణం లేదు. ప్రశాంతంగా బావగారు చెప్పిన మాటలు విన్నాడు. మరుసటి రోజున వీళ్ళ ఇంటికాడ భోజనం చేస్తున్నాడు శ్రీనాథుడు. ఇద్దరూ అన్నం తినడం పూర్తి అయిపోయింది. పూర్తి అయిపోయిన తరువాత కొంచెం ముందు విస్తర దగ్గర నుంచి పోతన లేచి ఏమి చేశాడు అంటే చెయ్యి కడుగుకోవడానికి బయటకి వెళ్లి శ్రీనాథుడుని బావ, బావ నీ కొడుకు నూతిలో పడిపోయాడు అని కేకలు వేశాడు. అంటే శ్రీనాథుడు పిల్లలు కూడా ఈయన ఇంట్లోనే ఉన్నారు. చుట్టరికానికివచ్చాడు బావ గారింటికిఅని, బావ బావ నీ కొడుకు నూతిలో పడిపోయాడు అని కేకలు వేశాడు. ఎవరు? పోతనామాత్యుడు. శ్రీనాథుడు ఏమి చేశాడు చెయ్యి కడుక్కోకుండా పరుగెట్టుకుంటూ వచ్చేశాడు నూతి దగ్గరకి. పోతనామాత్యుడు ఏమన్నాడు అంటే ఏమయ్యా, నీ కొడుకు నూతిలో పడిపోయాడు అని చెప్పాను కదా నువ్వు తాడు ఏదైనా తెచ్చుకోవాలి కానీ చెయ్యి కడుక్కోకుండా ఇక్కడకు ఎందుకు వచ్చావు అన్నాడట? నీ కొడుకు మీద నీకు ఎంత ఆసక్తి ఉంటుందో, విష్ణువుకి, భగవంతుడికి భక్తుడు మీద అంత ఆసక్తి ఉండదా? భగవంతుడు రక్షించాలి అంటే ఆయనకి చక్రం కావాలి ఏమిటి. మరి నువ్వు నిచ్చెనతేకుండా, తాడు తేకుండా నీ కొడుకుని ఎలా రక్షిద్దాంఅనినూతి దగ్గరకు వచ్చావు అని అడిగారు. అప్పుడు నోరు తేలేసి చూశాడు. తనకు అనుభవం అయ్యింది కాబట్టి విమర్శించటం పోయింది.

ఎవడికైనా తన దాకా వస్తేనే ఆ కష్టం తెలుస్తుంది. దరిద్రం కూడా అనుభవించే వాడికి తెలుస్తుంది. ఆకలి బాధ కూడా అనుభవించేవాడికి తెలుస్తుంది కాని లేకపోతే తెలియదు. శంకరాచార్యుల వారు ఏమి చెప్పారు అంటే మానవజన్మ రావటం, సత్పురుషుల

తోటి సహవాసం దొరకటం అంటే మంచి వాళ్ల తోటి సహవాసం దొరకటం, మంచి మాటలు వినే అదృష్టం రావటం, మోక్షం పొందాలి అని లోపల నుంచి కుతూహలం రావటం ఎన్ని జన్మలపుణ్యం ఉంటే వస్తుందో అన్నారుశంకరాచార్యుల వారు. నేను చెబుతున్నాను కాబట్టి మీరు వస్తున్నారు అనుకుంటున్నారు అది అబద్ధం. మీ పుణ్యం మిమ్మల్ని ఇక్కడకితీసుకు వస్తుంది. నేను చెబుతున్నాను కాబట్టి మీరు వస్తున్నారు అని మీరు ఎవరు అనుకోవద్దు. నేను చెబుతాను కాబట్టి ఊర్లో ఉన్న ఐదువేల మంది ఇక్కడకు ఎందుకు రావటం లేదు? మరి మీరే ఎందుకు వస్తున్నారు? మీరు చేసుకున్న పూర్వ పుణ్యం ఎంతో ఉంది కాబట్టి మిమ్మల్ని తీసుకువచ్చి ఇక్కడ కూర్చొబెడుతుంది. లేకపోతే నేనురమ్మన్నా మీరు రారు. మీకు నేనంటే ఇష్టం అనుకోండి ఊరికే ఆదివారం వచ్చి పది నిమిషాలు నన్ను చూసి వెళ్లిపోతూ ఉంటారు కాని ఇక్కడ కూర్చోలేరు. దాని లక్షణం అది. క్షీరాన్నం నోట్లో వేసుకుంటే దాని రుచి తెలుస్తుంది. ముక్కులో వేసుకుంటే దాని రుచి ఏమి తెలుస్తుంది? మాటలు కూడా అర్హత ఉన్న చోటుకే చేరతాయి. ఆ రసం కూడా రస హృదయులకే తెలుస్తుంది. రస హృదయం లేనివాడికి క్షీరాన్నం ముక్కులో పోసుకున్నట్టే.

సవినయంగా, సగౌరవంగా మీకు మనవి చేసుకునేది ఏమిటంటే, మీకు ఓపిక ఉంటే సాధన చెయ్యండి, లేకపోతే లేదు. మీ సాధనాల తోటి ఇంక పనిలేదు. మీరు ఆదివారం వచ్చి ప్రశాంతంగా పదినిమిషాలుకూర్చుని వెళ్లండి చాలు. సాధనలు అంటారా మీ ఇష్టం, అది మీ సంస్కారం బట్టి ఉంటుంది. నేను చెయ్యద్దుఅని చెప్పినా నేను సాధన చెయ్యాలి, నేను సాధన చెయ్యాలి అని లోపల నుంచి పొంగు వస్తుంటే ఎలాగా మానరు. మీకు ఆ పొంగు రానప్పుడు నేను చెయ్యమని చెప్పినా మీరు వినరు. మీకు ఆకలి ఉంది అనుకోండినేనుతినద్దుతినద్దు అన్నా మీరు తినేస్తారు. మీకు అసలు ఆకలి లేదు అనుకోండి ఆకలి లేనప్పుడు మిమ్మల్ని బ్రతిమాలినా నాలుగు కూరలు పెట్టినా తినరు మీరు. ఆకలి ఏ విధంగా అయితే జఠరాగ్ని నుంచి వస్తుందో ఈ సంస్కారం కూడా లోపల నుంచి రావాలి, మీ శక్తి నుంచి రావాలి.

మీరు మాటలు అనవసరంగా ఖర్చు పెట్టద్దు. నేను ఇన్ని మాటలు ఖర్చు పెట్టకూడదు ఒక చిన్న విషయం చెప్పటానికిఎక్కువ మాటలు నేను చెబుతున్నాను. మీరు జాగ్రత్తగా

చూడండి. సంత చేసుకుని రమ్మంటే కొంతమంది 10 రూపాయల సరుకు జాగ్రత్తగా బేరమాడి ఆరు రూపాయలకే తెస్తారు. కొంతమంది సంత అలవాటు లేనివాళ్ళు, బేరం ఆడటం చేతకాని వాళ్ళు పది రూపాయల సంత పదిహేను రూపాయలకి తెస్తారు. ఈ సంతలు తేలిక అనుకోకండి. ఐదు రూపాయలు తేడా వచ్చేస్తుంది సరుకులు మామూలుగా వస్తున్నాయి. నా దగ్గర చెడ్డ ఏమిటి అంటే మాటలు అనవసరంగా ఖర్చు పెట్టేస్తున్నాను. విషయాన్ని తక్కువ మాటలలో చెప్పేది ఎక్కువ మాటలలో నేను చెపుతున్నాను. విషయాన్ని తక్కువ మాటలలో చెప్పే బదులు, క్లుప్తంగా చెప్పే బదులు ఎక్కువ మాటలలో చెబుతుంటే కాలం చచ్చిపోతుంది. ఇన్ని మాటలు నాకు అనవసరం. ఇన్ని మాటలు చెప్పక్కర్లేదు అసలు, ఎందుచేత? మీరు అందరూ బుద్ధిమంతులు కాబట్టి.

క్లాసులో మూడు రకాల పిల్లలు ఉంటారు. తెలివైన వాళ్ళు ఉంటారు, మధ్యరకం పిల్లలు ఉంటారు, తెలివి తక్కువ వాళ్ళు ఉంటారు. మాష్టారు ఎవరి గురించి చెప్పాలి? మాష్టారు నోటి వెంట మాట వచ్చింది అంటే తెలివైన వాళ్ళు పట్టేస్తారు. రెండోసారి మాట్లాడితే మధ్యరకాలు పడతారు. మూడోసారి, నాలుగోసారి చెప్పినా కానీ మొద్దు అబ్బాయిలకి ఇంకా ఎక్కదు. నాలుగోసారి చెబితే తెలివైన పిల్లలకి చిరాకు వచ్చి అటు ఇటు చూస్తారు. మాష్టారు ఎవరిని ఉద్దేశించి చెప్పాలి మీరే ఆలోచించండి ఇప్పుడు. మొద్దు అబ్బాయిలు ఉంటారు క్లాసులో, మధ్యరకం మనుషులు ఉంటారు, తెలివైన వాళ్ళు ఉంటారు. తెలివైన పిల్లలను ఉద్దేశించి మాష్టారు చెబితే మధ్యరకం ఉన్నవాళ్ళకి, మొద్దులకి రాదండి. అలా చెబితే ఎలా మరి. అందుచేత ఒకొక్కసారి తెలివైన వాడిని, తెలివి తక్కువ వాడిని కూర్చొబెడితే ఒక ఎద్దును ఒక పక్కన, దున్నపోతును ఒక పక్కన కట్టేసి బండి లాగిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. బండికి ఒక కాడికి ఎద్దుని, ఒక కాడికి దున్నపోతుని కట్టాం అనుకోండి ఆ బండి తోలుతుంటే ఎలా ఉంటుందండి? ఎద్దు ఎదరకి వెళుతూ ఉంటుంది. దున్నపోతు వెనక్కి వస్తూ ఉంటుంది. ఇదంతా మాష్టారు మోయవలసిందే. తెలివి తక్కువ పిల్లలని దృష్టిలో పెట్టుకోవాలి. మధ్య రకంగా చదివే వాళ్ళని దృష్టిలో పెట్టుకోవాలి. బాగా చురుకైన పిల్లలను దృష్టిలో పెట్టుకోవాలి. ఒకసారి చెబితే సరిపోదు, టీచర్లు ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని చెబుతూ ఉండాలి. బైబిలులో ఒక మాట ఉంది. మిమ్మల్ని ఎవరైనా చెడ్డ మాటలు అంటుంటే,

మీకు ఎవరైనా చెడ్డ చేస్తుంటే నువ్వు ప్రతిఘటించకు. అప్పుడు మీలో ఉన్న పాపాలు సమూలంగా తొలగించ బడతాయి. ఎవరైనా మీకు చెడ్డ చేస్తుంటే మిమ్మల్ని చెడ్డ మాటలు అంటూ ఉంటే నువ్వు వాడిని ప్రతిఘటించకు. రమణ స్వామిని ఒక గురువు గారు వచ్చి నా దగ్గర మంత్రం తీసుకో అని అడిగారు. అప్పడు ఈయనకి బాగా చిన్నతనం. ఇంటికాడ నుంచి పారిపోయి వచ్చాడు. ఏదో బండతనంగా అలా కూర్చున్నాడు గోచీ పెట్టుకుని. ఈయన చదువుకున్న వాడు, పెద్దవాడు, నేను మంత్రం ఇస్తాను జపం చేసుకో అని అలా రెండు రోజులు చెప్పారు భగవాన్ మాట్లాడలేదు.

రమణస్వామి పుచ్చుకుంటాను అని చెప్పచ్చు, పుచ్చుకోను అని చెప్పచ్చు. ఏమీ లేదు. అప్పుడు ఆ మంత్రం చెప్పేవాడు ఏమన్నాడు అంటే మీరు నేను రాజీ పడదాం. ఆ గోడ తోటి రాజీ ఏంటి? ఆ గోడ ఎంతో ఆయన అంతే. అటు నుంచి response లేదు కదా, రాజీ ఏంటి గోడ తోటి, అప్పుడు ఏమన్నారు అంటే పెద్ద మంత్రం ఇవ్వను చిన్న మంత్రం ఇస్తాను. తక్కువ అక్షరాలు ఉన్న మంత్రం ఇస్తాను. అది జపం చేసుకో అన్నారు. అప్పుడు భగవాన్ నోరు విప్పారు, మీరు చిన్న మంత్రం ఇచ్చినా, పెద్ద మంత్రం ఇచ్చినా జపం చేసేవాడు ఇక్కడ లేడు. మీరు మంత్రం ఇస్తారు ఆ మంత్రానికి జపం చేసేవాడు ఉండాలి. వాడు చచ్చిపోయాడు. మీరు చిన్న మంత్రం ఇచ్చినా ఇక్కడ జపం చేసేవాడు లేడు. మీరు పెద్ద మంత్రం ఇచ్చినా ఇక్కడ జపం చేసేవాడు లేడు. ఇక్కడ జపం చేసేవాడు లేడు ఇంక మీరు ఎవరికి ఇస్తారు? దానాలు, ధర్మాలు చేస్తే మీకు మళ్ళీ జన్మ మంచి జన్మ వస్తుందని చెప్పకపోతే ఎవరు దానాలు చేస్తారు? ఎవరు ధర్మాలు చేస్తారు? ఏ శివుడికి అయినా అభిషేకం జరుగుతుందా? ఏసుక్రీస్తు చెప్పాడు మీరు పాపం చెయ్యకండి అని, కృష్ణుడు చెప్పాడు మీరు పాపం చెయ్యకండి అని. నాకు అనిపిస్తుంది మీలో ఎవరైనా పాపం చేస్తే, మీరు చేసిన పాపం నేను చేసినట్టుగా భావించకపోతే నేను బోధకే పనికిరాను. ఇంత చిన్న పాపం మీలో ఎవరైనా చేస్తే మీరు చేసిన పాపం నేను చేసినట్టు అనినాకు అనిపించకపోతే అసలు నేను ఈ కుర్చీలో కూర్చోవడానికి కాని, ఈ మాటలు చెప్పటానికి కాని పనికి రాను. పనికి రాను. మీరు నాకు పెట్టె నమస్కారానికి కూడా నేను అర్హుడను కాదు. అర్హుడను కాదు.

స్వామీజీ అన్నాడు అసలు ప్రపంచంలో పాపం లేదు, పొరపాట్లు ఉన్నాయి. పాపం అనే పెద్ద మాట చెప్పి మనిషిని బెదర కొట్టకండి, పొరపాట్లు ఉన్నాయి కాని పాపం లేదు. పాపం చేసేవాడికే ఇష్టం లేదు పాపం చెయ్యాలి అని, వాళ్ళ మీద చెడ్డ ప్రచారం చేస్తున్నారు, కానీ పాపం చేసినవాడిని అర్థం చేసుకోవడం కోసం మీరు ప్రయత్నం చేశారా? మీ చేతిలోనిరాళ్ళు వాడి మీద విసురుతున్నారు. వాడికోసం మీ నోటిని ఖర్చు పెడుతున్నారు. వాడికి సంబంధించిన విషయాల తోటి మీ మనసుని నింపుకుంటున్నారు. కానీ వాడిని అర్థం చేసుకునే హృదయం కానీ, వాడిని అర్థం చేసుకునే వివేకం కానీ, మీలో ఎవరికి ఉంది? ఒక్కటే గుర్తు మీకు లోపల అజ్ఞానం లేకపోతే పాపం ఎవరూ చెయ్యరు.

ఏ మనిషి అయినా సరే పాపం చేశాడు అంటే లోపల అజ్ఞానం ఉన్నట్టే. వాడు పాపి, వాడు పాపిఅని పదిసార్లు నిందించే బదులు వాడిలో ఉన్న అజ్ఞానం తొలగించడానికి మీరు ప్రయత్నం చెయ్యండి. ఎవడికైనా రోగం వచ్చింది అనుకోండి వాడికి రోగం వచ్చింది అని నిందించే బదులు మీకు నిజమైన సానుభూతి ఉంటే వాడిని వైద్యశాలకి తీసుకువెళ్ళచ్చు కదా. సంస్కారవంతుడు కూడా ఆ ఇంట్లోనే ఉన్నప్పటికీ ఒకచిన్న మనసు ఒకపెద్ద మనసునిఅర్థం చేసుకోలేదు. ఇంక ఆత్మ ఎలా అర్థం అవుతుంది? ఎప్పుడూ కూడా నా మీద నాకు జాలి ఉండకూడదు. ఎవడైతే తనమీద తాను జాలి పడడో వాడు అభివృద్ధిలోకి వస్తాడు. మన కృషే మన స్నేహితుడు. మన సోమరితనమే మన శత్రువు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **52010126418572**4 **(IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్।**

**ఉపైతి శాంతరజసం బ్రహ్మ భూత మకల్మషం ॥ 2-45 ॥**

తాత్పర్యము: ప్రశాంతమైన మనస్సు కలవాడును, పాప రహితుడును, రజోగుణ వికారములు లేనివాడును, అనగా ప్రాపంచిక కార్యముల యందు ఆసక్తి తొలగిన వాడును, సచ్చిదానంద పరమాత్మ యందు ఏకీభావమును పొందిన వాడును అగు యోగి బ్రహ్మానందమును పొందును.

'ప్రశాంత మనసం' అంటే శాంతితో కూడిన మనస్సు. మనస్సులో ఎటువంటి వికారములు లేకుండా ప్రశాంతముగా ఉండాలి. తల్లి గర్భం లోనుంచి బయటికి వచ్చింది మొదలు శ్మశానానికి వెళ్ళే వరకూ ఏ మనిషి జీవితం యూనిఫార్మ్ గా వెళ్ళదు. పరిస్థితులు ఎప్పుడూ ఒకలా ఉండవు. ప్రతివాడి జీవితంలో కూడా ప్రారబ్ధం ఎన్నో హెచ్చుతగ్గులు తీసుకొస్తుంది. అయితే ప్రారబ్ధం దేహానికి సంబంధించింది, నీ లోపల ఉన్నటువంటి అమృతత్వానికి, నీ లోపల చావులేని సత్వదార్థానికి ప్రారబ్ధంతో సంబంధం లేదు. రాధాకృష్ణన్ అన్నారు, శాంతిచిత్తం కలవాడు అదృష్టవంతుడు, అన్ని కాలాలలో అన్ని పరిస్థితులలో ఎవడైతే శాంతిగా ఉండగలుగుతున్నాడో వాడు మాత్రమే ఈ లోకంలో అదృష్టవంతుడు.

యోగినం సుఖముత్తమమ్- మనమందరమూ సుఖం కోరుకుంటాము. డబ్బు,

ఇల్లు, అధికారం, వీటిలో సుఖం లేకపోయినా, సుఖం వస్తుంది అనే ఉద్దేశంతోనే ఇవన్నీ సంపాదిస్తాము. విషయాలలోనుంచి, లేదా ప్రపంచాన్ని ఎంజాయ్ చెయ్యటం వల్ల సంతోషం రావచ్చు. ఇంద్రియాల ద్వారా మనం సేకరించిన సంతోషం, లేకపోతే ప్రపంచంలో మనకి అనుకూలమైన సంఘటనలు జరగటం వల్ల వచ్చే సంతోషం, ఇదంతా కూడా ఏనాటికైనా దుఖం కింద మారిపోతుంది.

ఇక్కడ భగవంతుడు ఏమంటున్నాడు అంటే, సుఖము అనేది ప్రపంచంలో ఏ పదార్ధములోనూ లేదు. బయట ఎక్కడా ఏమీ లేదు. నీ హృదయములో ఒక సత్యం ఉంది, అది నీ స్వరూపం. సుఖము నీ స్వరూపము లో ఉంది, శాంతి నీ స్వరూపములో ఉంది, ఆనందం నీ స్వరూపంలో ఉంది. ప్రపంచములో ఎక్కడో ఏదో సుఖము శాంతి ఉందని నువ్వు వెదుకుతున్నావు. ఏ దేశము వెళ్ళినా, ఎవరింటికి వెళ్ళినా, రాగద్వేషములు తప్పించి, కామక్రోధములు తప్పింది, ఈ సృష్టిలో చూడటానికి ఏమీ లేదు. మనకి ఎక్కడా రాగద్వేషాలు లేవు అనుకోండి, ఇష్టం అయిష్టం లేవనుకోండి, అసలు మన మనస్సుకి యోగాభ్యాసం అక్కరలేదు. ఇష్టాయిష్టాలతో మనకు కనుక సంబంధం లేకపోతే, మీ మనస్సు చలించమన్నా చలించదు. అప్పుడు మీరు ప్రాణాయామం చేసి, ధ్యానం చేసి మనస్సుని నిగ్రహించుకోనక్కర లేదు. రాగద్వేషాలు లేని వాడికి మనస్సు కదలమంటే కదలదు. ఎక్కడ రాగద్వేషాలు లేవో, ఎక్కడ కామక్రోధాలు లేవో, ఎక్కడ భయము లేదో, ఎక్కడ అశాంతి లేదో, ఎక్కడైతే దుఃఖస్పర్శ లేదో, అటువంటి స్వరూపం లోకి మేల్కోమని వ్యాసుడు చెప్పాడు. మీకు ఆ స్వరూప సుఖం తెలిసేవరకూ, ప్రపంచం లో ఏమీ లేకపోయినా, ఏదో ఉందని మనకి అనిపిస్తా ఉంటుంది.

ఉత్తమ సుఖం అంటే, బాహ్యమైన వ్యక్తుల తోటి కాని, వస్తువుల తోటి కాని, బాహ్యమైన సంఘటనల తోటి కాని సంబంధము లేకుండా నీకు స్వతంత్రముగా వచ్చే సుఖమే ఉత్తమ సుఖము. ఆ ఉత్తమ సుఖానికి మనం అందరం వారసులం కావాలి.


'ఉపైతి శాంత రజసం' అంటే మనకి రజోగుణం అణగాలి. లోకవాసన ఎక్కువగా ఉన్నవాడికి రజోగుణం ఎక్కువగా ఉంటుంది. అందుచేత లోకవాసనను తగ్గించుకొంటూ రావాలి. మనని నియమించేవాడు ఎక్కడో ఉన్నాడు అనుకోవద్దు, మన హృదయంలోనే ఉన్నాడు. మన ప్రాణానికి ప్రాణంగా ఉన్నాడు, మన దేహాన్ని ప్రారబ్ధాన్ని అనుసరించి ఆడిస్తున్నాడు.

మీకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత ఉందని తలంపు రూపంలో వచ్చేవరకూ మీకే తెలియదు. కాని నీకు తెలియకముందు కూడా, మీకు తలంపు రూపంలో రాకముందు, నీ లోపల బీజ రూపంలో సూక్ష్మ రూపంలో ఉన్నప్పుడు కూడా లోపల అంతర్యామిగా ఉన్న నారాయణుడికి తెలుస్తుంది, ఆయన అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి. ఏ మనిషికి ఏ బలహీనత ఉందో, ప్లస్ పాయింట్ ఏంటో మైనస్ పాయింట్ ఏంటో భగవంతుడికి తెలియకుండా ఏదీ ఉండదు.

బ్రహ్మ భూత మకల్మషం- బ్రహ్మ భూతమ్' అంటే బ్రహ్మ భావన పొందిన వాడు. మనమిప్పుడు దేహంతోటి ఏకముగా ఉన్నాము, కానీ లోపల సద్వస్తువు తోటి ఏకముగా ఉండాలి. ఒక సత్యం తప్పించి అన్నీ మనోకల్పితాలు. సంతోషం దుఖం అన్నీ మైండ్ క్రియేషన్. మనకి దేహంతోటి కానీ, ఇంద్రియాలతోటి కానీ మనస్సుతోటి కానీ తాదాప్యం ఉంటుంది. ఈ మూడు మనం కాదు. రాంగ్ ఐడెంటిఫికేషన్ నుంచి రాంగ్ థింకింగ్ వస్తుంది. లోపల వస్తువు నీకు తెలిసున్నా తెలియకపోయినా ఉంది. అది నీకు డైరెక్ట్ గా ఎక్స్‌పీరియన్స్ లో లేకపోయినా, అసలు అది ఉంది అని తెలియటానికి, ఆ ఫెయిత్ కలగటానికి నీకు పూర్వ జన్మ పుణ్యం ఉండాలి, ఎంతో కొంత సత్కర్మ నిష్కామంగా చేసి ఉండాలి.

నువ్వు కల్మషం లేకుండా, ధౌర్బల్యం లేకుండా  చూసుకోమని చెపుతున్నాడు భగవంతుడు. ఏ విషయమూ కూడా పాజిటివ్ గా ఆలోచించాలి కాని నెగెటివ్‌గా ఆలోచించకూడదు. మన బాడిలో ఫారిన్ మాటర్ ఏదైనా ప్రవేశిస్తే రోగం ప్రారంభమవుతుంది, ఆరోగ్యంలో తేడా వస్తుంది. అలాగే హృదయంలో కల్మషం ప్రారంభమైనప్పుడు ఆలోచనలో మీకు స్పష్టత ఉండదు, స్వచ్ఛత ఉండదు. నువ్వు ఏం మాట్లాడుతున్నావో నీకే తెలియదు. అందుచేత లోపల కల్మషం లేకుండా జీవించటం నేర్చుకో అర్జునా. అట్టి దోషరహితుడు అయిన ధ్యానయోగి ఉత్తమసుఖం పొందుతాడు.

కృష్ణుడు సపోర్ట్ ఇస్తాడు భగవద్గీతలో, నేను ఉన్నాను మీకేమీ భయం లేదు. మీరు సాధన చేయండి. మీలో ఏదైనా కల్మషం ఉన్నా నన్ను స్మరించుకోవటం వల్ల నేను ఎలిమినేట్ చేస్తాను. అని ఎక్కడికక్కడ పరమాత్మ మనకి సపోర్ట్ ఇస్తున్నాడు.



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

**నీ జ్వాల గాల్చినన్ నీరు సేసెడు మున్నె।**
**నీ కృప వర్షింపు మరుణాచలా ।55।**

తాత్పర్యము: నేను నీ అంతటి వాడినైన తరువాత నీ కృప నాకెందుకు అరుణాచలా? నీ జ్ఞానాగ్ని వచ్చి నా అహంకారాన్ని దహించి, నా అహంకారాన్ని హరించి నీ అంతటి వాడిని చేయకముందే నీ కృపను నా పైన కురిపించు అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా, నీ జ్ఞానాగ్ని వచ్చి నా అజ్ఞానాన్ని కాల్చక ముందే, నువ్వు నన్ను బర్న్ చేయక ముందే, నీ అనుగ్రహం వర్షింపుము. బయట వర్షం లేకపోతే మనం కంగారు పడతాము. కాని ఈశ్వరుడి యొక్క కృప, దైవానుగ్రహం అనే వర్షం, మన మనస్సుని మన హృదయాన్ని తడపకపోతే, మనము ఎప్పుడైనా బాధ పడ్డామా? ఇన్ని జన్మలు ప్రవహిస్తున్నాయి, ఒక జన్మలో కూడా ఈశ్వర అనుగ్రహం మన మీద పడలేదే, అమృత జల్లు మన మీద కురవలేదే, అని ఇసుమంత అయినా మన జీవితంలో ఏ సెకనులో అయినా బాధ పడ్డామా? నీ జ్ఞాన అగ్ని నన్ను దహించక ముందే, నీ కృప వర్షింపుము అంటున్నారు భగవాన్.

కామం అంటే స్త్రీ పురుష సంబంధంఒక్కటే కాదు, ప్రపంచంలో ఏ వస్తువు మీద మనకు వాంఛ కలుగుతున్నప్పటికీ, ఏ వస్తువు మీద మనకు మనసు వాలుతున్నప్పటికీ, అది కామమే, నీ దేహము నీ మనసు నువ్వు కాదు, నువ్వు కాని ఈ దేహాన్ని మనస్సుని నువ్వు అనుకుంటున్నావు. నువ్వు కాని వాసనలు కోరికలు నువ్వు అనుకుంటున్నావు. దీని వల్లే సంసారం పెరుగుతూ ఉంటుంది అన్నారు. మీ పిల్లలు మంచి వాళ్ళు తెలివి గల వాళ్ళు అనుకోండి, ఆ గుణాలని మీ మీద ఆరోపించుకుంటూ ఉంటారు. ఒక మంచి గుణమే కాదు, మీ అబ్బాయిలు ఎవరైనా తాగుబోతులైతే, మా అబ్బాయి సంసారం పాడు చేసేస్తాడు అని ఆ గుణం తీసుకు వచ్చి మీరు కుమిలిపోతూ ఉంటారు. ఈ సఫరింగ్

లోంచి మీకు తెలియకుండా, భవిష్యత్తులో కొన్ని వేలాది జన్మలకి బీజాలు పడుతున్నాయి.

భగవంతుడిని చేరుకోవాలంటే ప్రతీ జీవుడు భయం కోపం ఆశ అనే మూడు గుణాలు దాటాలని పరమాత్మ చెపుతాడు. ఏ జన్మలో అయినా సరే, మీరు ఏ లోకంలోకి వెళ్ళినా సరే, ఈ మూడు గుణాలను దాటాలి. మీరు భగవంతుడిని చేరుకోవాలంటే భయం, కోపం , ఆశ అంటే ఆసక్తి అనే మూడు గడపలు దాటాలి.

నీ జ్వాల నన్ను కాల్చి నీరు సేసెడు మున్నె - నాకు ఏదైనా రోగం వస్తే, డాక్టరు గారు అవసరం. రోగం తగ్గిపోయాక, డాక్టరు గారితో పని ఏమిటి? ఎవరైనా కష్టాల్లో బాధలలో ఉన్నప్పుడు మనం ఉపకారం చేస్తే అది నిజమైన సహాయం. కష్టాలు గట్టెక్కిన తరువాత మనం వాళ్లకి చేసే ఉపకారం ఏమిటి అసలు? నీ జ్ఞానం వచ్చి నా అహంకారాన్ని కాల్చక ముందే నువ్వు ఏదైనా చేస్తే చెయ్యి అరుణాచలేశ్వరుడా, నేను జ్ఞాని అయిన తరువాత నువ్వు నాకు చేసేది ఏముంది అంటున్నాడు. నాకు డబ్బు లేనప్పుడు మీరు రూపాయి ఇస్తే అది సహాయం. నేను కోటీశ్వరుడిని అయితే మీ రూపాయి నాకు ఎందుకు? ఓ అరుణాచలేశ్వరుడా నీ జ్ఞానం వచ్చి నన్ను కాల్చేసి నీ అంతటి వాడిని నన్ను చేసిన తరువాత, ఇద్దరం ఒక్కటే అయిన తరువాత, నువ్వు ఉద్ధరించేది ఏమిటి? అదేదో ముందే చెయ్యి! నా అహంకారాన్ని నేను స్వాధీనం చేసుకుని నీకు అప్పగించడానికి ఇది లొంగడం లేదు. అందుచేత ఆపరేషన్ చేసే ముందు పేషెంట్ ను డాక్టరు సిద్ధం చేసే విధంగా నీ కృపను వర్షించి, నీ ప్రేమ నా మీద కురిపించి, ఈ అహంకారాన్ని ప్రిపేర్ చేసి, ఈ జీవుడిని స్వాధీనం అయ్యేలా చేసుకో. జ్ఞానం పొందిన తరువాత నాకు ఈ అహంకారం అజ్ఞానం ఉండదు కదా. ఈ అహంకారం నన్ను destroy చేయక ముందే, నీ కృప అనే వర్షంలో నన్ను ముంచి, నీ ప్రేమామృతంలో నా అహంకారాన్ని కడిగేసి, అది ఏ విధంగా అయితే నీకు స్వాధీనం అవుతుందో, అలా చేసి అనుగ్రహించు.

భగవాన్ కృపాకటాక్షాలు నీ మీద వచ్చి పడినప్పుడు నదికి వరద వచ్చినంత వేగంగా వస్తుంది. అసలు నీకు ఊపిరే సలపదు. అనుగ్రహ వర్షంలో ఈ అహంకారం, ఈ మిథ్యానేను అడ్రస్ లేకుండా పోతాయి. అసలు దైవ కృప మీ మీద పడితే, ఆత్మ సుఖం అనేది, జీవితంలో కొన్ని సెకనులు అయినా నువ్వు అనుభవించి ఉంటే, ఆ సుఖం ముందు నువ్వు అనుభవిస్తున్న ఈ లోకానికి సంబంధించిన ఏ సుఖం అయినా సరే, పంచదార ముందు మట్టి ఎటువంటిదో, లోకానికి సంబంధించిన భోగాలు అన్నీ అలాగే కనిపిస్తాయి అన్నారు ఆచార్యుల వారు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సత్ప్రవర్తన

మన స్వరూపము సచ్చిదానందము. అట్టి స్వరూపమే అయిన సచ్చిదానంద స్థితి మనకు అనుభవంలో లేకపోవటానికి కారణం మన దేహాత్మబుద్ధే! కాబట్టి దేహాత్మబుద్ధి మరియు దాని కారణంగా ఎదురయ్యే ఇతర అవరోధాలను గుర్తించి వాటిని నివారించుకోవాలి. స్వస్వరూపానుభూతి మన పరమ గమ్యము కాబట్టి, దేహాత్మబుద్ధి త్యాగమే దానికి మూలము. విషయాసక్తిని తగ్గించుకుంటూ, అంతరదృష్టిని పెంచుకోవాలి. ఏమి జరిగినా మన మంచికే అని సమాధానపడాలి. ఇతరులను విమర్శించుట, తప్పలు ఎంచుట మానాలి. చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు తలచవద్దు అన్నది మహాత్ముల ఉవాచ. ఇతరులలోని దోషాలను మన్నించి వారిలోని మంచిని గ్రహించాలి. మనలోని దోషాలను సవరించుకొని మంచిగా ప్రవర్తించాలి. ఇతురులు చేసే పెద్ద తప్పలను చిన్న తప్పలుగా భావించాలి. ఇతరుల పట్ల మనము చేసే చిన్న తప్పలను పెద్ద తప్పలుగా భావించి సరిదిద్దుకోవాలి. ఇతరులలోని దోషాలు, వికారాలు, అసూయ మున్నగు వాటిని మనము చూడరాదు. వారిలో ఉన్న చైతన్యాన్నే దర్శించాలి, వారిలోని దోషాలను చూస్తే అవి మనకు సంక్రమిస్తాయి. కష్టాలే మనకు నిజమైన మిత్రులు. సుఖము కన్నా దుఃఖమే మనకు మంచి గురువు. సహనము, సానుభూతి, దానగుణము మున్నగువాటిని పెంపొందించుకోవాలి. జగత్తును పరమాత్మ స్వరూపంగా గ్రహించి, ప్రతి పనిని పరమాత్మ పనిగా చేయాలి. మనకు ఇష్టమైన పనిని ప్రేమతో చేయడం కాదు, మనము చేసే ప్రతి పనిని ప్రేమతో, ఈశ్వరార్పణబుద్ధితో చేయడంలో ఆనందించాలి. దుఃఖం నశించాలంటే స్వార్థమును పోగొట్టుకోవాలి, తృప్తిగా జీవించాలి. మోక్షంలోకి ప్రవేశించడానికి ఓరిమి, తృప్తి, సత్సంగం, విచారణ నాలుగు ద్వారాల వంటివి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# చిత్త త్యాగమే - సర్వ త్యాగము

'మనస్సే జాడ్యం' అంటారు. మనస్సుకు తనకు కావలసింది ఏమిటో దాన్ని సృష్టించుకొనే శక్తి ఉంటుంది. మనస్సుకు కలలు కనే శక్తి ఉంటుంది. కిక్కిరిసిపోయిన ఆలోచనలతో అది పిచ్చిది అవుతుంది. బుడగను గట్టిగా ఊదితే పేలిపోతుంది. మనస్సు అంతే. మనస్సు అంగడి సంత లాంటిది. మనశ్శాంతికోసం హిమాలయాలు వెళ్ళినా, తిరుపతికి వెళ్ళినా మన వెంటే ఉండి దాని ఆట అది ఆడుతుంది. విషయ భోగాలు ఆశించి ఆ చింతన చేస్తూ ఎన్ని నాళ్ళు ధ్యానించినా వ్యర్థమే. మనకు ఇష్టం లేని ఏ ఇంద్రియములు మనలను ఏమీ చెయ్యలేవు. వాటికి స్వశక్తి లేదు. విషయాల వైపుకు వెళ్ళవద్దు. అవి ధృఢ ప్రతిజ్ఞ చేసుకొంటే అవి లొంగిపోతాయి. మనస్సు పరిగెత్తుచున్నదని విచారపడకూడదు. మనం వాటి వెంట పరుగెత్తకూడదు. దానివైపు చూడక నిశ్చలంగా నామస్మరణ చేయటమే దానికి మందు. శ్రీనాన్నగారు "కొంతమందికి నేత్రానందమనే బలహీనత ఉంటుంది. దానితో వారి మనస్సు బాహ్యముఖం వైపు పరుగెడుతుంది" అన్నారు. ఇంద్రియాలు చెలరేగి మనలను విషయాలవైపుకి ఈడ్చేస్తే మేలుకొని బ్రహ్మత్వాన్ని నిలుపుకోవాలి. మానవుడు తన వాసనల బట్టి ఆతని ధ్యాస - బుద్ధి - రూపము ఉంటుంది. అదేవిధంగా లోకాన్ని చూస్తాము. మనం కైవల్యాన్ని పొందాలంటే సద్గురువు చేరితే కాని ఆ సమస్యలు పరిష్కారం కావు. మన సంస్కారాలు ప్రేరణ చెయ్యబడిన స్థితిలో మనం ఆలోచిస్తాము. కోరికలను కోరతాము. తదనుగుణంగా మన కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలను వినియోగించుకొంటూ నిస్సహాయంగా జీవిస్తాము. అక్కడ నిరోధించుకొనే అవకాశం ఇయ్యబడదు. ఏ మహా గురువో కలుగజేసుకొని ఆ వాసనలను నిరోధించి సన్మార్గంలో అంటే ఆధ్యాత్మిక మార్గంలో మళ్ళించగలడు. ఒక స్త్రీ గానీ, పురుషుడు గానీ చూచి సౌందర్య భూమి మీద నడుస్తున్నది అని తలచుటయే దుఃఖము. వైరాగ్యం ఉన్న సాధకుడు ఇది అంతా అనర్థంగా భావిస్తాడు. సంగమమే లేకుండా చేసుకోవటం మంచి మార్గం. మనస్సు ఉన్నంతకాలం అది ఈ మట్టి బొమ్మలను సృష్టిస్తూనే ఉంటుంది. హిస్టీరియా శృంగారపరమైన కోరికను అణిచివేత వల్ల వస్తుంది. ఆ రోగానికి ఆత్మవిచారణ మనస్సు వికసించే గ్రంథ పఠనం అవసరం ఎంతో మేలు చేస్తుంది. సామాన్యంగా పూర్వజన్మలో వేశ్య అయితే ఈ జన్మలో మహా పతివ్రత అవుతుంది. ఈ జన్మలో మహా పతివ్రత అయితే వచ్చే జన్మలో వేశ్య అవుతుందని దివ్యజ్ఞానులు అంటారు. అది మనకు అర్థంకాని విషయం కాబట్టి ఏ వేశ్యను ఈసడించుకోకూడదు. అలాగే పతివ్రతను చూసి మురిసిపోకూడదు. ఉదాసీనభావం అలవర్చుకోవాలి. ఇది ధర్మ సూక్ష్మమని పెద్దలు చెబుతారు. భగవాన్ "మీకు ఆత్మానందం కొన్ని సెకనులు ఉంటుంది. ఎలా అంటే జున్ను తిన్నప్పుడు, గర్భ శత్రువు మరణిస్తున్నప్పుడు, భార్యతో సంభోగం చెరమాంకంలో మనస్సు శూన్యమైపోయి అహంకారం ఆత్మలో విలీనమై ఒక సెకను మెరుపులా మెరుస్తుంది. తదుపరి దుఃఖం మామూలే" అన్నారు. ఆత్మ సుఖం శాశ్వతమైనది. కామం ఉన్నచోట రాముడు ఉండడు. రాముడు ఉన్నచోట కామం ఉండదు. సూర్యుడు ఉన్నచోట చీకటి లేదు, చీకటి ఉన్నచోట సూర్యుడు ఉండడు. రెండూ ఒకచోట ఉండవు. సత్యాన్ని పొందాలంటే పై విషయాలలో మర్మాన్ని గ్రహించాలి. దానికి అనుగుణంగా నడవాలి. ఇదే ధర్మ సూక్ష్మం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**